క్లుప్తంగా

పక్షవాత బాధితుడికి సాయం


పక్షవాత బాధితుడికి సాయం అందిస్తున్న దృశ్యం

భీమవరం: పక్షవాతంతో బాధపడుతున్న కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాస్‌కి సోమవారం స్థానిక శ్రీనివాస థియేటర్ సెంటర్‌లోని తన కార్యాలయం వద్ద రూ.11 వేలు ఆర్థిక సాయం అందించామని కృష్ణ బలిజ సేవాసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఘంటా త్రిమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో గంటా నాగలక్ష్మి, తిప్పా ముత్యం, గంటా దుర్గారావు, బొక్కా అప్పారావు, యలమంచిలి శ్రీను, విన్నకోట వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాబ్జి మృతి తీరని లోటు


సాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆకస్మిక మృతి విద్యారంగానికి తీరనిలోట జనవిజ్ఞానవేదిక(జేవీవీ) జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చుండూరి సాయిబాబు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు, నంద్యాల భాస్కరరాజు, జి.గోపిమూర్తి, జె.రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, రేపాక వెంకన్నబాబు, కె.సత్యలక్ష్మి, ఎ.జాన్సన్ పాల్గొన్నారు.

పాస్టర్లకు ఘన సత్కారం


చెరుకువాడలో పాస్టర్లను సత్కరిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఉండి: చెరుకువాడలో బాప్టిస్ట్ చర్చి కౌన్సిల్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు పాస్టర్ రెవరెండ్ ఎస్ జార్జ్‌ముల్లర్ సోమవారం తెలిపారు.ఉండి, కాళ్ల మండలాలకు చెందిన అర్తమూరు, చెరుకువాడ చినపేట, పెదపేట, ఇమ్మానుయేలుపేట, కలిసిపూడి, కోలనపల్లి పెదపేట, గరువుపేట గ్రామాల్లోని చర్చిల ప్రతినిధులు ఈ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం పాస్టర్ జార్జ్‌ముల్లర్ క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల చర్చి సీఆర్‌లు, ట్రెజరర్స్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఇంధనాన్ని ఆదా చేయాలి


ఈఈ అహ్మద్‌ఖాన్

భీమవరం: భావితరాల అవసరాల కోసం ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎలక్ట్రికల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ అన్నారు. స్థానిక విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ డీఈఈ రాజగోపాల్‌చౌదరి, ఏఈలు శ్రీనివాసరాజు, పద్మ, అప్పారావు, శ్రీనివాసరావు, ఆర్‌విడి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 4 అర్జీలు

ఆకివీడు: స్పందన కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కె.వాణీ సోమవారం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు. ఫిర్యాదుల్ని ఆయా శాఖల అధికారులకు పంపినట్లు వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ సమస్యలు పరిష్కారించాలని డీఆర్వో బి.శ్రీమన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ. 26 వేలు, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని, అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించి జూనియర్ ఎఫ్ఏఎల్‌లకు ఎఫ్టీఎల్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ ప్రతాప్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తేలి శాంతిస్వరూప్, నాయకులు భవాని, రమేష్, ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, అబ్రహాం, కేపీ రాజు, మహేష్ రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

షష్ఠి మహోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): షష్ఠి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీరాంపురంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం (సుబ్బారాయుడు గుడి)లో స్వామివారి దర్శనం కోసం భక్తులు తెల్లవారు జాము నుంచే క్యూకట్టారు. అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారని ఆలయ ఈఓ దండు వెంకట కృష్ణంరాజు తెలిపారు. ఈనెల 19న తెల్లవారు జామున 4 గంటలకు స్వామివార్ల కల్యాణం, సాయంత్రం 4 గంటలక రథోత్సవం, 20న రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 21న స్వామివార్లకు త్రిశూల స్నానోత్సవం ఉంటుందని చెప్పారు. పట్టణంలోని పలు శివక్షేత్రాల్లో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఆయా ఆలయాల్లో స్వామివార్ని దర్శించుకున్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో కొలువైన వల్లీదేవ సేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 72 వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. యర్రంశెట్టి ధర్మారావు – బాల త్రిపుర సుందరీదేవి, యర్రంశెట్టి శ్రీనివాస్ – జ్యోతి దంపతులచే స్వామివార్లకు కలశ పూజ, గౌరీ, విఘ్నేశ్వర, తదితర పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు స్వామివారి సందర్శనార్థం అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ వంటకాలతో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మార్మోగిపోయింది. భీమవరం మండలం కొత్తపూసలమర్రు, దొంగపిండి, గూట్లపాడు, యనమదుర్రు, దిరుసుమర్రు, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, తాడేరు, బేతపూడి, వెంప, తుందుర్రు, అనాకోడేరు, కొమరాడ తదితర గ్రామాలలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద భక్తులు తేగ, చలిమిడి, నాటు క్రోడిగుడ్లు, ఆవుపాలతో ప్రత్యేక పూజలు చేశారు.


భీమవరం (ప్రకాశంచౌక్) : సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు


భీమవరం అర్బన్ : గొల్లవానితిప్ప గ్రామంలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


వీరవాసరం : తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం

వీరవాసరం మండంలో..

వీరవాసరం: మండలంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తోలేరులో వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, తోకలపూడి, రాయికుదురు, కొణితివాడ, నడపనవారిపాలెం, వీరవాసరం, పంజావేమవరం, మత్స్యపురి తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేర స్వామి ఆలయాల్లో ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. తొలుత స్వామివార్లకు హోమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, భైరవభట్ల మురళీకృష్ణ శర్మ, కోటిపల్లి వెంకటేశ్వర బాపూజీ, వన్నెంరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనం సాగించాలి


తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: ఆధ్యాత్మిక భావంతో జీవనం సాగించడం వల్ల సాత్విక గుణం అలవడుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం తోలేరు వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సోమవారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరికీ ఆ స్వామివారి దివ్యాశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. సుబ్రహ్మణ్యేర కళాపరిషత్ వేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో చవ్వాకుల సత్యనారాయణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ గొలగాని సత్యనారాయణ, మేకా శ్రీనివాసు, భోగిరెడ్డి శ్రీనివాసు, కోడి శ్రీనివాసు, కడలి శ్రీరాములు, పోలిశెట్టి సత్యనారాయణ, ఇంటి రాఘవేంద్ర, మండపాక రాంబాబు, చికిలే మంగతాయారు, కోడి అప్పారావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సకల దోషాలు హరించే సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆకివీడు: సకల దోషాల్ని హరించే సుబ్రహ్మణ్యేశ్వరుడు ప్రజలకు ఆయురారోగ్యాలు అందజేయాలని ప్రార్థించినట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక ఆనాల చెరువు వద్ద వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని, అయిభీమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని పీవీఎల్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతనమైన ఆలయాన్ని రూ. 2 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, డైరెక్టర్లు జగ్గురోతు విజయ్‌కుమార్, మేకా పార్వతి, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నేరెళ్ల రామకృష్ణ, మోటుపల్లి రామకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


ఆకివీడు: అయిభీమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్న పీవీఎల్

కాళ్ళ: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోమవారం కలవపూడి శివారు వావిలాలపాడులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. వావిలాలపాడులో పెన్మత్స దుర్గాప్రసాద్ ఆర్థిక సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా ఆక్వా మండలి సభ్యుడు పెనుమత్స దుర్గాప్రసాదరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


ఉండి: యండగండిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

ఉండి: సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి పండుగను పురస్కరించుకుని సోమవారం యండగండిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దర్శించుకుని పూజలు చేశారు.

పాలకోడేరు సోమేశ్వర స్వామి ఆలయంలో..

పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు వైభవంగా నిర్వహించారు. పాలకోడేరులోని సోము కల్యాణ మండపం ఆవరణలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కునాధరాజు గణపతిరాజు, సుజాత దంపతులు అభిషేకం నిర్వహించారు. శృంగవృక్షంలోని సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం, పద్దాలమ్మ, మారెమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, ఆలయ చైర్మన్ ఇందుకూరు బలరామరాజు, కొత్తపల్లి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ఏఎంసీ మాజీ చైర్మన్ ఏడుకొండలు

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిని అందించడమే కాకుండా ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలం ఎల్‌వీఎస్ పురం గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి తిరిగి గత నాలుగున్నరేళ్లలో గ్రామానికి అందిన లబ్ధి, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరే విధంగా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని వివరించారు. గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్‌ను నియమించి, పథకాలను పారదర్శకంగా అమలు చేఉస్తున్నారని చెప్పారు. ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయడమే కాకుండా డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారని తెలిపారు. మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాడు నేడు పథకం ద్వారా సుమారు రూ.21 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. తాడేరు వద్ద గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై రూ.2.30 కోట్లతో వంతెన నిర్మించారని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. 100 పడకల ఆస్పత్రి కోసం నాలుగెకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించారని గుర్తుచేశారు. రూ.38 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న మూడు వంతెనలకు అప్రోచ్‌ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేయించారన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు నాలుగు చోట్ల అండర్ టన్నెల్స్ నిర్మించారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సహాయక కార్యదర్శి నామన మహేష్, సర్పంచ్ కేతా నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరవల్లి శ్రీనివాస్, పెచ్చెట్టి పవన్ కుమార్, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, కోళ్ల బాలకృష్ణ, పెనుమాల నరసింహస్వామి తదితర వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


భీమవరం అర్బన్ : వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


భీమవరం (ప్రకాశంచౌక్) : 24వ వార్డులో జెండా ఆవిష్కరించిన నాయకులు

జగన్‌తోనే పథకాల కొనసాగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్ మళ్లీ రావాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, పార్టీ నాయకుడు కోడే యుంగధర్ అన్నారు. సోమవారం 24వ వార్డులో వార్డు ఇంచార్జి లక్కు త్రిమూర్తులు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు వార్డులో ర్యాలీ చేశారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భోగయ్య, యుంగధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సురక్షితంగా ఉన్నారని మళ్లీ ఆయననే సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పేదవాడిని పథకాలు అమలు ద్వారా అదుకుంటే ప్రతిపక్ష పార్టీల ధనవంతులు బాధపడడం సిగ్గుచేటన్నారు. గత పాలనలో ప్రజల సొమ్ము దోపిడీ చేస్తే నేడు ప్రజల సొమ్మును ప్రజలకు కోసం ఖర్చు చేయడం తప్పా అని ప్రశ్నించారు. సంక్షేమం పథకాలు ద్వారా అందించిన ప్రతి రూపాయి పేదవాడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేవూరి గోగురాజు, గంటా సుందర్ కుమార్, నల్లం రాంబాబు, ముద్దుల కరుణాకర్, కరీముల్లా బాషా, ఇంటి సత్యనారాయణ, కందికట్ల ఎడ్వర్డ్, పాలపర్తి జోనా, గుంటి ప్రభు, నల్లం రఘుబాబు, రామాయణం గోవింద్, సూరిబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, నందమూరి ఆంజనేయులు, సాధనాల బాలస్వామి, బొత్స ధర్మ, బుద్ధరాజు రామకృష్ణ వర్మ, తుళ్లూరు చంటి, రేలంగి శ్రీనివాస్, విజయదుర్గ, పార్టీ శ్రేణులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏసుపాదం

భీమవరం: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ముందున్న వైఎస్సార్ సీపీని మరింత బలోపేతానికి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడిగా నియమితులైన ముమ్మిడివరపు ఏసుపాదం సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా జనవరి 1 నుంచి పింఛన్ సొమ్ము రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచుతున్నట్టు చెప్పారు. నవరత్న పథకాలు అమలతో పేద కుటుంబాలనూ లక్షాధికారులను చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఇక నుంచి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చని చెప్పారు. జగన్‌కు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉండి: వెలివర్రులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం బావాయిపాలెంకు చెందిన వడ్డి నాగరాము ఉండి మండలం వెలివర్రులో వీరపేరంటాలమ్మ గుడికి ఆదివారం వచ్చాడు. గుడి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో ఏపీ 39 డీజే 7991 నంబరు వాహనం అతడ్ని వేగంగా ఢీ కొట్టింది. నాగరాము కుడి కాలు విరగడంతో పాటుగా తల వెనుక గాయాలయ్యాయి. అతడ్ని హుటాహుటిన భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై ఏ సూర్యనార్యాయణ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెంట్రల జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 2023-24 వివిధ పోటీ ల్లో స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 13 పతకాలు సాధించి సత్తా చాటారు. 400 మీటర్లు విభాగంలో ఎ.నాగ నంధిని స్వర్ణ పతకం, 4 ఇన్ టూ 100 మీటర్లు విభాగంలో కె.గీతామాధురి, పి.స్వాతి స్వరూప, ఎ.నాగ నందిని, టి.హిమదుర్గలు స్వర్ణ పతకాలు సాధి ంచారు. 4 ఇన్ టూ 400 మీటర్లు పురుషులు విభాగంలో బి.తరుణ సాయి, ఎస్.సాయిరాం, జి.శివశంకర్ వరప్రసాద్, పి.చక్రమణికంఠ రజత పతకాలు సాధించారు. పురుషులు జావలిన్ విభాగంలో జి.నాగశ్రీనివాసరావు, 200 మీటర్లు పరుగుపెందెంలో కే.గీతా మాధురి, పదివేల మీటర్లు పరుగు పందెంలో జి.శివశంకర్‌వరప్రసాద్‌లు రజత పతకాలు సాధించారు. పురుషులు 400 మీటర్లు పరుగు విభాగంలో పి.చక్ర మణికంఠ క్యాంస్య పతకం సాధించారు. వీరిని కళాశాల యాజమాన్యం, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

భగవద్గీతపై ప్రచారం

ఉండి: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక భీమవరం కమిటీ చైర్మన్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉండిలో పలువురు సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా


ఉండిలో ఆరోగ్యశ్రీ బ్రోచర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు, వైద్య సిబ్బంది

ఉండి: ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జగన్‌మోహన్‌రెడ్డి మరో భరోసా ఇచ్చారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది సమక్షంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త బ్రోచర్‌ను ఎంపీపీ విడుదల చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలంతా ఆయనకు జేజులు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ప్రాణానికి సీఎం జగన్ భరోసాగా నిలుస్తూ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం నిజంగా అద్భుతమని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.వెయ్యి దాటిని వైద్య సేవలు ఆరోగ్యశ్రీలోకి తీసుకురావడంతో పాటుగా ఇప్పుడు దాని పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచడం దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అద్భుత అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కే కొండలరావు,వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

పెనుగొండ: రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆచంట మండలం కొడమంచిలిలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తో అనేక దీర్ఘకాల వ్యాధులను నయం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ రూ.5లక్షల నుంచి వైద్యానికి అయ్యే ఖర్చు రూ.25 లక్షల వరకూ నేరుగా ప్రభుత్వమే భరిస్తుందని పెంచడం ద్వారా పేదలకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. 108, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వైద్యాన్ని ఇంటికే చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీడీవో నరసింహ ప్రసాద్, ఆచంట వేమవరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సత్యవి, ఎంపీటీసీలు యల్లమెల్లి బేబీ రాజేష్, చిలుకూరి నాగ దుర్గాభవానీ నరేంద్ర, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆక్వా కల్చర్‌పై సెమినార్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జువాలజీ, ఆక్వా కల్చర్, కళాశాల ఐక్యూఏసీ సహకారంతో ఆక్వా కల్చర్ పురోగతి, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలో ఏలూరులోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి వివిధ యూనివర్శిటీల నుంచి రిసోర్స్ పర్సన్స్ రావడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.